నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం ఇండోర్ కాకతీయ కర్షక్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ శాంతిగార్డెన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ మరమ్మత్తులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11 కేవీ సాయిబాబా దేవాలయం ఫీడర్ పరిధిలో మ. ధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఐలా, సీఐఏ ప్రతినిధులు



కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఐలా చైర్మన్ గోవిందారెడ్డి, చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్.రెడ్డి ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించి సత్కరించారు. చర్లపల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానన్నారు. లయన్ హరీష్‌రెడ్డి, బండారి నీలంరెడ్డి తదితరులున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అల్వాల్: వెంకటాపురం డివిజన్ కమలాలయ కాలనీలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో వరదనీటి పైపులైన్ పూర్తిగా మట్టితో పేరుకుపోవడంతో కాలనీలో మురుగు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. అనిల్‌కిషోర్‌గౌడ్, కాలనీవాసులు వినోద్‌కుమార్, అశోక్ తదితరులున్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్‌వీ నేత



ఎంపీ ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న నవీన్‌రెడ్డి

అల్వాల్: బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర యువనాయకుడు నవీన్‌రెడ్డి తన బృందంతో కలిసి బీజేపీలో చేరారు. ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో నవీన్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ సహా పలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. పార్టీ అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

మల్కాజిగిరి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, కార్పొరేటర్ శ్రవణ్ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈవో రవీందర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

మర్యాద పూర్వక కలయిక



అల్వాల్: వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన స్వగృహంలో వైఎస్‌ఆర్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌గుప్తా కలిసి శాలువాతో సత్కరించారు.

వ్యర్థాలను తొలగించరూ..!

● పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్త,చెదారం ● దోమలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



పెద్ద చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

మేడిపల్లి: పీర్జాదిగూడ పెద్ద చెరువును గత ప్రభుత్వంలో నగర పాలకవర్గం ఆమోదంతో చెరువు సుందరీకరణకు సుమారుగా రూ.14.5 కోట్లతో మినీట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసి కార్పొరేషన్ ప్రజల అవసరాలకు తగినట్లుగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం చెరువు వ్యర్థాలతో నిండిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరిశీలించిన మాజీ మేయర్..

చెరువు పరిస్థితిని తెలుసుకునేందుకు మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆదివారం చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కతో పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన చెరువు వద్ద నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించామన్నారు. ప్రధానంగా చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల ఉధృతితో ప్రజలకు కంటిమీద కునుకు కరువైందన్నారు.

నేరుగా డ్రైనేజీ కలవకుండా చర్యలు..

డ్రైనేజీ నేరుగా చెరువుల్లో కలవకుండా తగిన చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అసౌకర్యాలను గుర్తించామన్నారు. అనంతరం చెరువుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే తగిన చర్యలు తీసుకునేలా కమిషనర్ త్రిలేశ్వర్ రావు, మున్సిపల్ అధికారులను కోరారు. మాజీ కార్పొరేటర్ మహేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు జావీద్‌ఖాన్, వెంకటేష్‌గౌడ్, కిరణ్‌నాయక్, శంకర్‌రావు, పింగళి జోగిరెడ్డి, ప్రవీణ్, పాశం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలతో నిండిపోయిన ఓపెన్ డ్రెయిన్

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

కుషాయిగూడ: మతసామరస్యానికి ప్రతీక మొహరం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీలో జరిగిన మొహరం వేడుకల్లో ఆదివారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, గణేష్, ప్రవీణ్, సంతోష్‌గౌడ్, సందీప్, నిస్సార్‌అహ్మద్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్ : మొహర్రం సందర్భంగా సీఐటీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రామంతాపూర్ టీవీ స్టూడియో వద్ద శర్బత్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయూ నేతలు మాట్లాడుతూ.. మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, కేవలం ఈ ఒక్క పండుగనే హిందూ, ముస్లింలు కలిసి చేసుకుంటారన్నారు. మేడ్చల్ జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. గౌస్, యూనియన్ నేతలు కైతర్ జాంగీర్, ఖలీమ్, సల్మాన్, ఖదీర్, సీపీఎం ఉప్పల్ సర్కిల్ సెక్రటరీ వెంకన్న పాల్గొన్నారు.

మౌలాలి : మొహర్రం పర్వదినాన్ని పురష్కరించుకుని మౌలాలి డివిజన్‌లో పీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పీర్ల ఊరేగింపులో పాల్గొని సందడి చేశారు. కాంగ్రెస్ నేతలు వెంకటేష్‌యాదవ్, వినోద్‌యాదవ్, నిరంజన్, హమీద్ తదితరులున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం !



న్యూ మిర్జాలగూడ వద్ద కంచె లేకుండా రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. న్యూ వెంకటేశ్వరనగర్, గౌతంనగర్, మిర్జాలగూడ సత్యనారాయణ కేఫ్, తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, కొమ్మలు పెరిగి ఉండటంతో వర్షాకాలంలో షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు తక్కువగా ఉండి చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కాప్రా: ఎల్లారెడ్డిగూడ కృష్ణానగర్‌లో నెలకొన్న సమస్యలను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీతో పాటు పలు సమస్యలతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు యుగేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి విక్రమ్‌కుమార్, జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు పూర్తి చేయాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం అన్నపూర్ణ కాలనీలో ఠాగూర్ ఇంటి వరకు సీసీరోడ్డు లేక రోడ్డు అధ్వానంగా ఉందని, సీసీరోడ్డు వేయాలని ఆదివారం నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. రూ.30 లక్షలతో సీసీరోడ్డు పనులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, త్వరలోనే నిధులు మంజూరు చేయించి సిమెంట్ రోడ్డు పనులు చేపట్టేలా చూస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అలీపాషా, సుధాకర్, పాండురంగారావు, రవి, చందు, నాగయ్య, పిచ్చయ్య, రమేష్, గోవింద్, బాలయ్య, సంతోష్, శ్రీనివాస్, మల్లయ్య, అసద్, సురేందర్, ముంజాత్, వజీర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సీనియర్ సిటిజన్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని, ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం భవానీనగర్ సీనియర్ సిటిజన్ ఆఫీస్‌ను స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవానీనగర్‌లో డ్రైనేజీ సమస్యలతో పాటు పలు సమస్యలున్నాయని, తన దృష్టికి వచ్చిందన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీనియర్ల అనుభవాలు కాలనీ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, శేఖర్, శ్రీరాములు, స్థానిక కాలనీవాసులు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్‌నేత నెమలి అనీల్‌కుమార్ అన్నారు. ఆదివారం బస్తీబాటలో భాగంగా ఓల్డ్ మల్లాపూర్ పఠాన్‌బస్తీలో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాలకు అందేలా ప్రజలను చైతన్యవంతం చేస్తుమన్నారు. మేడ్చల్ జిల్లా ఎస్సీసెల్ సలహాదారులు పీజీ సుదర్శన్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నేతలు బాలరాజ్‌గౌడ్, పంజాల శ్రీనివాస్, సురేష్‌గౌడ్, ఎస్టీసెల్ అధ్యక్షుడు మహేష్‌నాయక్, అశోక్‌గౌడ్, జానీ, ఇంతియాజ్‌బేగం తదితరులున్నారు.

ప్రతి కాలనీలో కమ్యూనిటీ హాల్

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పద్మావతి కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను స్థానిక కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. డివిజన్‌లో ప్రతి కాలనీకి ఒక కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ హాల్స్‌ను సంరక్షించుకునే బాధ్యత కాలనీవాసులదేనన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అరవింద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

బండచెరువు పరిరక్షణకు కృషి

మౌలాలి : కాలుష్యకాసారంగా మారిన బండ చెరువును పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పరిసర ప్రాంత కాలనీవాసులు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. బండచెరువు పరిరక్షణ జేఏసీ చైర్మన్ పెంటయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌బీహెచ్ కాలనీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై తీర్మానం చేశారు. బండచెరువు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 60 కాలనీవాసులు దోమలు, దుర్గంధంతో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు ప్రభాకర్‌గౌడ్, విజయ్‌కుమార్, రమేష్, సలీమ్, రామ్మోహన్, గోపీనాథ్, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య అకాడమీ సేవలు ప్రశంసనీయం

రామంతాపూర్ : తెలంగాణ భాష, సాంస్కృతికశాఖ సౌజన్యంతో స్థానిక సాయిస్వరని నృత్య అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో నృత్య శిక్షణ పొందిన చిన్నారులకు ఆదివారం కార్పొరేటర్ శ్రీవాణి స్థానిక ఆర్టీసీ కమ్యూనిటీహాల్‌లో బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాయిస్వరిని నృత్య అకాడమీ గత 17 ఏళ్లుగా చిన్నారులకు నృత్యంలో శిక్షణనిచ్చి నృత్యకారులుగా తీర్చిదిద్దడం ప్రశంసనీయమన్నారు. నృత్య అకాడమీ చైర్మన్ హిమతేజ శ్రీనివాస్‌రావు, దయానంద్‌రెడ్డి, ఆనంద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో తొలి ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి స్వామి వారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని శివారెడ్డిగూడ వీరాంజనేయ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణవ్రతం ఆచరించారు. ఆలయ ధర్మకర్తలు రాంరెడ్డి, అంజిరెడ్డి, నర్సింహ్మారెడ్డి, ఆలయ పూజారి వరదాచార్యులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పనులను నిలిపేయాలి

అధికారుల వైఖరిపై ఎంపీ ఈటల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్: ప్రజల నిరసనలను ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణలోకి తీసుకోకుండా జీహెచ్ఎంసీ అధికారులు హిందూ శ్మశానవాటిక స్థలంలో చెత్త డంపింగ్‌యార్డు నిర్మాణ పనులు చేపట్టడంపై ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మచ్చబొల్లారంలోని డంపింగ్‌యార్డు నిర్మాణ పనులను నిలిపేయాలని కోరుతూ కొంతకాలంగా స్థానికులు చేస్తున్న నిరసన శిబిరాన్ని ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా వారికి సంఘీభావం తెలిపారు. ప్రజలు చేస్తున్న ఆందోళనలను అధికారులు పట్టించుకోకపోవడంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేల సూచనలను సైతం లెక్కచేయడం లేదని ధ్వజమెత్తారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు : మాధవిలత

హిందూ శ్మశానవాటికకు దాతలు ఇచ్చిన స్థలాన్ని అధికారులు డంపింగ్‌యార్డుకు ఉపయోగించడంపై బీజేపీ సీనియర్ నాయకురాలు మాధవీలత ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ శ్మశానవాటిక స్థలాన్ని కాపాడుకోవడానికి పోరాటం చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, వీకె.మహేష్, ప్రసన్న కుమారి, వెంకటేష్, కరుణశ్రీ, గోపీ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

బోడుప్పల్: పోచమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య అన్నారు. చెంగిచర్లలోని ద్వారకానగర్ కాలనీ ఫేస్ 2లో ఆదివారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ 21,116లు అందజేశారు. కాలనీవాసుల సహకారంతో ఆలయాన్ని త్వరతిగతిన పూర్తి చేస్తామన్నారు. యువ నాయకులు బింగి యోగేష్‌యాదవ్, కాలనీ అధ్యక్షులు రాజుగౌడ్, ద్వారకానగర్ ఫేస్- 1 అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, పర్వతాలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో జంగయ్యయాదవ్

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లో కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ పాదయాత్ర చేపట్టారు. కాలనీలో సీసీరోడ్లు, కాలనీలోని పార్కు అభివృద్ధి, పిల్లల ఆటస్థలం పునరుద్ధరణ తదితర సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కాలనీ అధ్యక్షుడు రెహమాన్, హరికృష్ణ, రాజు, శ్రీనివాస్, హర్ష, రజని, నర్సింహులు, మౌనిక, శైలజ, కాంగ్రెస్ నేతలు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేష్, కొండల్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

మల్లాపూర్: సీఎం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు హమాలీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మల్లాపూర్ అంబేడ్కర్ భవన్‌లో 9న జరగబోయే సమ్మెకు మద్దతు ఇవ్వాలని జీహెచ్ఎంసీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమ్మెకు సంపూర్ణ మద్దతును కార్మికులకు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫ్లోర్ లెవల్ వేతనంగా రోజూ రూ.176 చాలన్న జీవో తెచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయానికి గురిచేస్తోందన్నారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మున్సిపల్ రంగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్, కాప్రా సర్కిల్ సీఐటీయూ మున్సిపల్ నాయకులు గణేష్, కార్మిక నేత కుర్మన్న, యాకస్వామి, మల్లేష్ గోవర్ధన్‌రెడ్డి, నరసింహ, పద్మ, లక్ష్మి, శంకరమ్మ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు



బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పలువురు ప్రజా ప్రతినిధులు నివాళులర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. పలువురు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల సమన్యాయం కోసం బీజేఆర్ పోరాటం చేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు

శ్యామా ప్రసాద్ ముఖర్జీని స్ఫూర్తిగా తీసుకోవాలి



డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్థానిక నాయకులు

రామంతాపూర్ : యువత డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీని స్ఫూర్తిగా తీసుకుని, జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఆదివారం రామంతాపూర్ కామాక్షిపురం కమ్యూనిటీహాల్‌లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ శ్రీవాణితో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశంలో మొట్ట మొదట భారతీయ జన సంఘ్ పేరిట హిందూ పార్టీని ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆధునిక హిందూ భావాలు కలిగి జాతీయ భావాన్ని ప్రగాఢంగా విశ్వసించిన ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మేడ్చల్ జిల్లా బీజేపీ కో – కన్వీనర్ నారాయణదాస్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సంతోష్ గుప్తా, సుధాకర్, అంజయ్యపటేల్, తిరుపతయ్య, కురుమ నరసింహ తదితరులు పాల్గొన్నారు.